క్లుప్తంగా

కల్యాణం కమనీయం



సంతగుడిలో వేంకటేశ్వరుడి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కారేపల్లి: కారేపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి (సంతగుడి)ఆలయంలో ఆదివారం శ్రీలక్ష్మి పద్మావతి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ఈశ్వరశాస్త్రి, నాగసాయి శర్మ, మల్లిఖార్జునశర్మ, వాసుదేవశర్మ, దేవేందరశర్మ, సోమరాజు లక్ష్మీనరసింహాశర్మల ఆధ్వర్యంలో కల్యాణ తంతును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓ నల్లమోతు శేషయ్య, పగడాల మోహన్‌కృష్ణ, పాల్గొన్నారు.

నియామకం



శ్రీనివాసరావు

వైరా: నాయీబ్రాహ్మణ సమైక్య సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వైరాకు చెందిన దేవరకొండ శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం నూతన కమిటీని ప్రకటించగా ఖమ్మం నగరానికి చెందిన గజ్జల వెంకన్న అధ్యక్షుడిగా వర్కింగ్ ప్రసిడెంట్‌గా సింగరాల వెంకటస్వామి, ఇతర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా నాయీబ్రాహ్మణ నూతన సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు సహకరించనున్నట్లు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు..



ఎస్సై నాగుల్‌మీరా

చింతకాని: హోలీ వేడుకల్లో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నాగుల్‌మీరా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం కమిషనర్ ఆదేశాల ప్రకారం హోలీ వేడుకలను రహదారులపై, బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించకూడదని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు, వాహనాలపై రంగులు చల్లకూడదని, గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో మైకులు, డీజేలు పెట్టవద్దని హెచ్చరించారు. డీజేలు, బైక్ ర్యాలీలకు అనుమతి లేదని, శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే సహించేది లేదన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో హోలీ వేడుకలను జరుపుకోవాలని సూచించారు.

వేణుగోపాల ఆలయ ప్రతిష్ఠ వేడుకలు



యాగశాల స్తంభానికి పూజలు చేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని జవహర్‌నగర్ శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠ వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా యాగశాల మూలస్తంభాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయంలో దేవతామూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, వాసు, రామకృష్ణ, శైలజ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వివాహ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



వివాహ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభిమాని గంధసిరి సత్తయ్య – శేషమ్మ దంపతుల కుమారుడి వివాహం వచ్చే నెల 5వ తేదిన వివాహం నిశ్చయమైంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి – మాధురి దంపతుల ఫొటోలతో వివాహ ఆహ్వాన పత్రికలను ముద్రించారు. ఆదివారం వివాహ పత్రికలను తక్కెళ్లపాడు గ్రామంలో డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మీడియా ఇన్‌చార్జ్ మల్లెల లక్ష్మణరావులు ఆవిష్కరణ చేశారు. నాయకులు నాగిరెడ్డి, రమేష్, ప్రవీణ్ కుమార్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుదీనా సాగు.. లాభాలు బాగు

- డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగు
- తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు
- హోల్ సేల్‌గా కట్ట ఐదురూపాయలు
- మంగాపురం ఆకు కూరల సాగులో ప్రసిద్ధి

తల్లాడ: వాణిజ్య పంటలకు లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి దిగుబడులు రాక, ధర లేక దిగాలు పడుతున్న నేటి తరుణంలో ఆకు కూరల సాగుతో లాభాలు పొందుతూ ఆదర్శంగా నిలిచాడు రైతు. ముఖ్యంగా పుదీనా ఆకు కూర సాగు చేసి అందులో లాభాలు గడిస్తున్నాడు. తల్లాడ మండలం మంగాపురం గ్రామంలో గాదె నరసింహారావు అనే రైతు పుదీనా తోటను గత నాలుగేళ్లుగా సాగు చేస్తున్నాడు. సాధారణంగా ఈ ప్రాంతంలో పుదీనా ఆకుకూరను తొలిసారి తాను సాగు చేసి అందులో లాభాలు గడిస్తూ పలువురు రైతులకు ఆదర్శంగా నిలిచాడు.

డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పుదీనా సాగు..

మంగాపురంలో మూడున్నర ఎకరాల్లో పుదీనా సాగు చేసి డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీరు పెడుతున్నారు. సొంతంగా డ్రిప్ ఇరిగేషన్‌ను ఏర్పాటు చేసుకొని పుదీనా, కాకర, దోసకాయ పంటలను కూడా సాగు చేస్తున్నారు. పుదీనా ఆకుకూర డ్రిప్ సహాయంతో సాగు చేసేందుకు మంచి అనుకూలంగా ఉంటుంది. డ్రిప్ ద్వారా నీరు వదిలితే పైరంతా తడిసి పోతుంది. దీంతో ఆకు కూర ఏపుగా పెరుగుతుంది. దానికి సరిపడా నీరు అందుతుంది. నీరు పెట్టడం కూడా రైతుకు తేలికగా ఉంటుంది.

అంటుకట్టే పద్ధతి ద్వారా సాగు..

పుదీనా ఆకు కూరను రైతు అంటు కట్టే పద్ధతి ద్వారా సాగు చేశాడు. మొదట అంటుకట్టి నీరు పెడితే రెండు నెలలకు పుదీనా కోతకొస్తుంది.



మంగాపురంలో సాగు చేసిన పుదీనా తోట (ఇన్‌సెట్) పుదీనా ఆకును కోస్తున్న కూలీలు

ఆ తర్వాత మళ్లీ డ్రిప్ ద్వారా నీరు పెట్టుకుంటూ కలుపు పీకి పోషణ చేసుకుంటే 45 రోజుల్లో రెండో కోత వస్తుంది. మళ్లీ డ్రిప్ ద్వారా నీరు పెట్టుకుంటే 45 రోజుల్లోనే కోతకొస్తుంది. ఈ విధంగా 20 కోతల వరకూ పుదీనాను తీయవచ్చు.

ప్రతి నెలా రూ.50 వేలు ఆదాయం..

ఎకరానికి లక్ష రూపాయల లెక్కను పెట్టు బడితో మూడెకరాలమీద అన్ని ఖర్చులు పోను నెలకు రూ.50 వేలు రైతుకు లాభం వస్తుంది. చీడ పీడలు కూడా తక్కువే. కట్ట రూ.5కు హోల్ సేల్‌లో వైరా మార్కెట్‌లో వేసి వస్తున్నారు. మార్కెట్‌లో దీని రేటు రూ.10 నుంచి రూ.20 వరకు ధర పలుకుతుంది.



పుదీనా తోటలో డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు

దిగుబడిని బట్టీ వైరా మార్కెట్‌తో పాటు ఒక్కోసారి కొత్తగూడెం, ఖమ్మం, తల్లాడ, ఇతర ప్రాంతాలకు కూడా పుదీనాను సరఫరా చేస్తుంటారు.

కూలీలకు ఉపాధి..

పుదీనా తోటల వల్ల కూలీలకు ఉపాధి దొరుకుతుంది. ఎకరానికి పది మంది కూలీలు పుదీనా కోసి కట్టలు కట్టాల్సి ఉంటుంది. మూడున్నర ఎకరాల మీద ప్రతి రోజు 30 మంది కూలీలు పని చేస్తున్నారు. పుదీనాను కొడవళ్లతో కోసి కట్టలు కడుతారు. ఈ కట్టలను మళ్లీ ఓ సంచిలో పేర్చి మార్కెట్‌కు తరలిస్తుంటారు. కలుపు పెరగకుండా పీకేందుకు కూడా కూలీల అవసరం ఉంటుంది. నిత్యం పుదీనా తోటలో కూలీలు అవసరం బాగా ఉంటుంది. ఒక్కో కూలీకీ రోజుకు రూ.400 చొప్పున చెల్లిస్తున్నారు.

పుదీనా సాగులో మంగాపురం ఆదర్శం..

పుదీనా సాగులో మండలంలోనే మంగాపరం ఆదర్శంగా నిలిచింది. గత నాలుగేళ్లుగా పుదీనా సాగు చేస్తూ నష్టాలే లేకుండా కూలీలకు ఉపాధి కల్పిస్తూ తాను లాభాలు గడిస్తున్న రైతు గాదె నరసింహారావు ఇతర రైతులకు ఆదర్శం. మంగాపురంలో పుదీనాతో పాటు తోట కూర, పాలకూర, బచ్చలికూర, టమాట, దోసకాయ, వంకాయ, బెండకాయ, బీరకాయ వంటి పంటలను కూడా పండిస్తున్నారు. దీంతో మంగాపురం ఆకు కూరలు, కూరగాయల సాగులో ఆదర్శంగా నిలిచింది.

ప్రతి నెలా ఆదాయం వస్తుంది..



పుదీనా సాగుతో ఆదాయం వస్తుంది. నిత్యం పరిశీలనలో ఉంటే పుదీనా సాగు లాభదాయకమే. ఒక్క సారి అంటు కట్టుకొని నీరు పెట్టుకుంటూ వస్తుంటే 20 సార్లుకైనా పుదీనా తీయవచ్చు. కలుపు పెరగకుండా చూసుకోవాలి. చీడ పీడలు కూడా తక్కువే. మూడున్నర ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేసినప్పటికీ నెలకు రూ.50 వేలు అన్ని ఖర్చులు పోను ఆదాయం సమకూరుతుంది.

– గాదె నరసింహారావు, రైతు, మంగాపురం

ప్రతీ రోజు కూలీ దొరుకుతుంది..



పుదీనా తోటలో గత మూడేళ్లుగా క్రమం తప్పకుండా కూలీ దొరుకుతుంది. ఎకరానికి పది మంది కూలీలు వరకు ఆకు వచ్చినప్పుడల్లా అవసరం ఉంటుంది. అంతేకాక కలుపు తీసేందుకు కూడా కూలీల అవసరం ఉంటుంది. ప్రతి రోజు రూ.400 చొప్పున కూలీ ఇస్తున్నారు. పుదీనాను కోసి కట్టలు కట్టి సంచుల్లో నింపుతున్నాం.

– తాళ్లూరి రమాదేవి, వ్యవసాయ కూలీ, మంగాపురం

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మధిరరూరల్: సిరిపురం ప్రభుత్వ హైస్కూల్ 1990–1991 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై చేరుకొని సందడి చేశారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్న చిన్ననాటి స్నేహితులు నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకర పలకరించుకొని అలనాటి గురువులను సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

సరస్వతిలో..



సరస్వతి విద్యాలయం పూర్వ విద్యార్థులు

కారేపల్లి: మండలంలోని కామేపల్లి క్రాస్‌రోడ్డులోని శ్రీసరస్వతి విద్యాలయంలో 2004–05 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శేషు, నారాయణ, రామ్మూర్తి, జానిమియా, భాస్కర్, ఉపేందర్, రమేష్, నిర్వాహన కమిటీ సభ్యులు ఎస్‌కే అహ్మద్, మల్లికంటి కృష్ణమూర్తి, నల్లమోతు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్

మధిర/ముదిగొండ: నేరాలను నియంత్రించేందుకు వాహనాల తనిఖీలు నిర్వహించిన పోలీసులు నంబర్‌ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. మధిర పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై సంధ్య వాహన తనిఖీలు నిర్వహించి వాహనాలను సీజ్ చేశారు. అదే విధంగా ముదిగొండలో ఎస్సై గజ్జెల నరేష్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఇటీవల రెండు లారీలు, రెండు ద్విచక్రవాహనాలపై నంబర్ ప్లేట్లు లేకుండా రవాణ జరుపడంతో సీజ్ చేసి, చీటింగ్ కేసులు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు



మధిర: సీజ్ చేసిన వాహనాలతో ఎస్సై సంధ్య

నంబర్ ప్లేట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనదారులకు పలు సూచనలు చేశారు.

హోలీ వేడుకలు

మధిర: పట్టణంలోని బంజారా కాలనీలో ఆదివారం హోలీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తండా నాయకులు, పెద్దలు, పిల్లలు అందరూ రంగులు చల్లుకొని కేరింతల కొడుతూ ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో తండా నాయకులు కోటియా నాయక్, పాండు, నాగేశ్వరరావు, బాలు, కృష్ణ, బాబ్లా నాయక్, రమణా నాయక్ పాల్గొన్నారు.

బంజార సేవా సంఘం ఆధ్వర్యంలో..



హోలీ వేడుకల్లో రంగులు చల్లుకుంటున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: బంజార సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని జలగంనగర్‌లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలు చేసి మేకలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. రామకృష్ణ, వెంకటేశ్వరరావు, రోశయ్య, నాగరాజు, భద్రు, అనంతరాములు, శ్రీనివాసరావు, గణేష్, రాములు నాయక్ పాల్గొన్నారు.

క్రీడలతో ఐకమత్యం

చింతకాని: క్రీడలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని ఎస్సై షేక్ నాగుల్‌మీరా తెలిపారు. మండలంలోని కోమట్లగూడెం గ్రామంలో శ్రీశ్రీశ్రీ లక్ష్మీ అంకమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఆదివారం ఎస్సై ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గ్రామీణ క్రీడలు కనుమరుగవుతున్న నేటి తరుణంలో గత 26 సంవత్సరాల నుండి కబడ్డీ పోటీలను నిర్వహించటం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు లక్కిరెడ్డి కృష్ణారెడ్డి, బాబురెడ్డి, కంసాని సత్యనారాయణరెడ్డి, అవులూరి యుగంధర్‌రెడ్డి, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

టెట్ ఫీజు తగ్గించాలి

ఏన్కూరు: తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ పరీక్ష ఫీజును ప్రభుత్వం తగ్గించి నిరుద్యోగులపై భారాన్ని తగ్గించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొవ్వూరి నాగేశ్వరరావు కోరారు. ఆదివారం ఆయన ఏన్కూరులో మాట్లాడుతూ.. టెట్ ఫీజు ఒక పేపర్‌కు రూ.వెయ్యి, రెండు పేపర్లకు రూ.2 వేలుకు పెంచడం వల్ల నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే ఉద్యోగాలు లేక తల్లిదండ్రులకు భారంగా ఉంటున్న నిరుద్యోగులను ఆదుకుంటామని ఎన్నికల హామీలిచ్చిన ప్రభుత్వం ఫీజులు పెంచి నడ్డి విరుస్తున్నదన్నారు. ప్రభుత్వం తగ్గించేవరకు ఆందోళన తప్పదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్, రాందాస్, కృష్ణ, నారాయణ, పాల్గొన్నారు.

సాగునీటి కాల్వలు పునరుద్ధరించాలి

వైరా: వైరా మున్సిపాలిటీ గండగలపాడు సమీపంలో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డు హైవే వల్ల పంట పొలాలకు సాగునీరందించే కాల్వలు ధ్వంసమయ్యాయని వాటిని సదరు నిర్మాణ సంస్థ పునరుద్ధరించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సీపీఎం తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతురాంబాబు డిమాండ్ చేశారు. కాల్వల నిర్మాణ పనులు గురించి అడిగితే సంస్థ ప్రతినిధులు దాటవేత ధోరణి ప్రదర్శించడంతో రైతులు పెద్ద ఎత్తున హైవే నిర్మాణ పనులు నిలిపివేయాలని పిలుపునివ్వడంతో నిర్మాణ సంస్థ ప్రతినిధులు సాగునీటి కాల్వ పునరుద్ధరణకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు రామారావు, మణి, వీరభద్రం, సుధీర్, సత్యం, కృష్ణ, రవి, మురళి, రామయ్య, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన

పెనుబల్లి: మండలంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి పర్యటించారు. ఈ సందర్భంగా రంగారావుబంజర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సోమరాజు సీతారామారావు కుమారుడు వివాహ రిస్పెషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్‌లు హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డి, నవజీవన్, కోటేశ్వరరావు, దామోదర్, కృష్ణవేణి, రాజా పాల్గొన్నారు.

పరామర్శ

తల్లాడ: మండలంలోని బిల్లుపాడు జిల్లా కాంగ్రెస్ నాయకుడు జక్కంపూడి కృష్ణమూర్తి అనారోగ్యానికి గురికావడంతో ఆదివారం పొంగులేటి ప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వరరావు, దుండేటి వీరారెడ్డి, దీవెల కృష్ణయ్య, ఎర్రి నరసింహారావు, తుమ్మలపల్లి రమేష్, బాబు, నరసింహారావు, వెంకటనారాయణ, ప్రభాకర్‌రావు, కేవీ, నాగన్న, యాకూబ్‌పాషా పాల్గొన్నారు.



కృష్ణమూర్తిని పరామర్శిస్తున్న పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, నాయకులు

యురేనియం కోసం సర్వే ఆపాలి

మధిరరూరల్: నల్లమల అడవుల్లో యురేనియం కోసం చేస్తున్న సర్వేని వెంటనే ఆపాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్ కోరారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 93వ వర్ధంతి వారోత్సవాల సందర్భంగా దెందుకూరు గ్రామంలో డీవైఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటి వారికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లమల అడవుల్లో పురాతనంగా జీవిస్తున్న చెంచులు, గోండు జాతులను అడవుల నుంచి బయటకు పంపించి యురేనియం కోసం సర్వేలు చేసి వేలాది అడుగులలోతు బోర్లు వేసి తవ్వకాలు జరిపి నల్లమల అడవులను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. దీంతో పర్యావరణం దెబ్బతింటుందని, కృష్ణా నది జలాలను కలుషితం చేస్తూ, గిరిజన హక్కులను కాలరాస్తూ



మొక్కలు నాటుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

బీజేపీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందని తెలిపారు. యురేనియం తవ్వకాలు జరిపే ప్రాంతం నుంచి కొన్ని వందల చదరపు కిలోమీటర్లు గాలి, నీరు కలుషితమై మానవులు, జంతువులు ఊపిరితిత్తుల కేన్సర్‌తో చనిపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీరభద్రం, మురళి, అజయ్, నజీర్, నాగ, కార్తీక్ పాల్గొన్నారు.

నేటి నుంచి కమలాపురంలో అంకమ్మ జాతర

ముదిగొండ: మండలపరిధిలోని కమలాపురంలో సోమవారం నుంచి ఐదు రోజుల పాటు శ్రీమహాలక్ష్మి, శ్రీఅంకమ్మ, శ్రీమద్దిరావమ్మ, పెద్దమ్మ అమ్మవార్ల జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. వంద ఏళ్ల నాటి నుంచి ఆనవాయితీగా హోళీ రోజు నుంచి చేపడుతున్న శ్రీఅంకమ్మ జాతర అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. ఖమ్మం జిల్లాలోని పలు మండలాల నుంచే కాక ఏపీలోని జగ్గయ్యపేట, భద్రాద్రికొత్తగూడెం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ఈ నెల 25న సోమవారం రాత్రి అమ్మవార్ల నిధి ఎక్కటం, అంకురార్పణ కార్యక్రమం నిర్వహిస్తుంటారు. అయ్యగారిపల్లి నుంచి తెల్లవారుజామున గ్రామ పెద్ద ప్రభ ఊరేగింపు కార్యక్రమంతో మొదలౌతుంది. 26న మంగళవారం గ్రామంలో జలబిందెలతో ఊరేగింపు, 27 బుధవారం న స్వామివార్ల ఇరుముడి కార్యక్రమం, అయ్యగారిపల్లి, కమలాపురం నుంచి గ్రామ ప్రభల ఊరేగింపుతో దేవాలయంకు చేరుకుంటాయి. రాత్రి



కమలాపురంలో శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మి అమ్మవార్ల దేవాలయం

రావిచెట్టు, వేపచెట్టుకు కల్యాణం నిర్వహిస్తారు. అనంతరం శ్రీమహాలక్ష్మి అమ్మవారి కల్యాణక్రతువు వైభవంగా నిర్వహిస్తారు. 28గురువారం న శ్రీమహాలక్ష్మి, శ్రీఅంకమ్మ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో కమలాపురం, అయ్యగారిపల్లి గ్రామాలలో ఊరేగింపు కార్యక్రమం.29 శుక్రవారం అయ్యగారిపల్లి, కమలాపురం నుంచి భక్తులు బోనాలతో ఊరేగింపు. 30 శనివారం చంద్రపట్నం, అమ్మవారి దివెన బండారు వసంతోత్సవములతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తారు.

ఉత్తమ సేవా అవార్డులు



మధిర: ఉత్తమ సేవా అవార్డు అందుకుంటున్న కొండయ్య



ముదిగొండ: డీఎంహెచ్ఓ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ప్రవీణ్



ఎర్రుపాలెం: ఆశా కార్యకర్త సుధారాణికి అవార్డు అందజేస్తున్న డీఎంహెచ్ఓ మాలతి



తల్లాడ ల్యాబ్ టెక్నీషియన్‌కు ప్రశంసపత్రం అందజేస్తున్న డీఎంహెచ్ఓ

మధిర/ముదిగొండ/ఎర్రుపాలెం/తల్లాడ/కొణిజర్ల: ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవ సందర్భంగా మధిరలోని దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఇద్దరు వైద్య సిబ్బంది ఉత్తమ సేవా అవార్డులు పొందారు. ఉత్తమ సేవలందించిన ఆరోగ్య పర్యవేక్షకుడు లంకా కొండయ్యకు, దెందుకూరు పీహెచ్‌సీ పరిధిలోని మధిర పట్టణం సబ్‌సెంటర్–2లో పనిచేస్తున్న సీనియర్ ఏఎన్ఎం వంగూరి విజయకుమారికి ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డీఎంహెచ్‌వో మాలతి, జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి వరికూటి సుబ్బారావులు అవార్డు అందజేశారు. అదే విధంగా ముదిగొండలోని వల్లభి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న రాయల వెంకటప్రవీణ్‌కు, ఎర్రుపాలెంలోని బనిగండ్లపాడు పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ఆశా కార్యకర్త నంద్రు సుధారాణికు, తల్లాడలోని కుర్నవల్లి ఏఎన్ఎం సునీత, తల్లాడ ప్రభుత్వ ఆస్పత్రి ల్యాబ్ టెక్నీషియన్ ధనకొండ కృష్ణారావుకు, కొణిజర్లలోని లాలాపురంకు చెందిన ఆశా కార్యకర్త కోపెల అరుణకు డీఎంహెచ్ఓ, జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి ఉత్తమ సేవా అవార్డులు అందించారు. ఈ సందర్భంగా వారిని ఆయా పీహెచ్‌సీల సిబ్బంది, అధికారులు అభినందించారు.

కాంగ్రెస్ పార్టీలోకి కొత్తవారిని తీసుకోవద్దు..

కల్లూరురూరల్: కాంగ్రెస్ పార్టీలోకి ఇతర పార్టీలకు చెందిన నాయకులను తీసుకోవద్దని కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవంగా నిర్ణయించింది. కల్లూరులోని డీఎస్సీ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి ముఖ్య నాయకుల సమావేశానికి సీనియర్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, ఏనుగు సత్యంబాబు నాయకత్వం వహించారు. మండల స్థాయి నాయకులు ఎవరైనా కాంగ్రెస్ పార్టీలోకి రాదలుచుకుంటే స్థానిక ఎమ్మెల్యే అనుమతితో రావాల్సిందేనని స్పష్టం చేశారు. అదే విధంగా మండలంలోని నాయకుల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అత్యధిక మెజార్టీతో విజయం సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు చందర్‌రావు, సత్యంబాబు, కృష్ణ, మోహన్‌రావు, యాకూబ్‌అలీ, రంగారెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఏసురెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



వైరాలో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు



పెనుబల్లి: వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

వైరా/ఏన్కూరు/సత్తుపల్లిరూరల్/ముదిగొండ/పెనుబల్లి/కల్లూరు/కల్లూరురూరల్/తల్లాడ: క్రైస్తవ మందిరాల్లో ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని సత్తుపల్లిలో, వైరా శాంతినగర్ ఆర్‌సీఎం చర్చిలో, ఏన్కూరులో, ముదిగొండలోని బెతెస్త ప్రార్థనా మందిరంలో, కల్లూరులోని టిల్ ఫ్లవర్ చర్చిలో, కల్లూరురూరల్‌లోని ఆర్‌సీఎం చర్చి, పెద్దకోరుకొండిలోని ఆర్‌సీఎం చర్చిల్లో, తల్లాడలో మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. అదే విధంగా పెనుబల్లి మందిరంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే మట్టా రాగమయి పాల్గొని క్రైస్తవులకు మట్టల ఆదివార శుభాకాంక్షలు తెలిపారు. అనంతం భక్తులు భక్తిశ్రద్ధలతో మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవ భక్తులు పుర వీధులలో ప్రాణి కొమ్మలు, కొబ్బరి మట్టల ఆకులు, ఈత చెట్ల కొమ్మలను పూలతో అలంకరించుకుని హోసన్నా హోసన్నా అంటూ భక్తి శ్రద్ధలతో దేవుని ప్రార్థించుకుంటూ ప్రదర్శన చేశారు. ఫాదర్లు మాట్లాడుతూ ప్రతీ క్రైస్తవుడు 40 రోజుల పాటు చేస్తున్న ఉపవాస దీక్షలు నేటికి చివరి ఆదివారం



ముదిగొండలో..

కావడంతో ఈ ఆదివారం నుంచి గుడ్ ఫ్రైడే వరకు వారం రోజుల పాటు ఆడంబరాలకు పోకుండా మౌనం పాటిస్తూ యేసు క్రీస్తును ధ్యానించుకుంటూ జీవించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్లు సురేష్ జోష్, ఆనంద్, పాస్టర్ పీజే శామ్యూల్, రాజ్‌కుమార్, ఎస్తేర్, తల్లాడ లూర్థుమాతా చర్చి ఫాదర్ అజయ్, బైబిల్ మిషన్ పాస్టర్ రెవ॥ రాకడ రాజు, లింగాల రమేష్, శిరసాని వెంకటేశ్వరరావు, విశ్వాసకులు పాల్గొన్నారు.